ప్రజాశక్తి

బుధవారం 22 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

అమరావతిపైనే ఆశలు!

- సేవా రంగంపైనే అధికారుల దృష్టి
- వ్యవసాయం తిరోగమనం-పారిశ్రామీకీకరణ నామమాత్రం
- 2024-29 కాలానికి ఐదేళ్ల విజన్ డాక్యుమెంట్ రూపకల్పన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని జిల్లాలో కొత్తగా చేపట్టబోయే నిర్మాణాలు, విద్యా సంస్థలు, ఐటి రంగాలపైనే ఎన్నో అంచనాలతో స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంటేషన్‌ను జిల్లా అధికారులు రూపొందించారు. 2014 నుంచి 2019 మధ్య కూడా ఇలాగే విజన్ డాక్యుమెంట్లను రూపొందించగా ఆచరణలో అమలు కాలేదు. జిల్లాలో గత పదేళ్ల కాలంలో పారిశ్రామికీకరణ ఏమాత్రం వృద్ధి సాధించలేదు. వ్యవసాయ రంగంలో 10 ఏళ్లలో క్షీణత కన్పిస్తోంది. సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది. ఇప్పటి వరకు ఏటా జిల్లాలో వివిధ రంగాల్లో వస్తున్న ఆదాయంలో అధికంగా సేవా రంగం ద్వారానే వస్తున్నట్టు అధికారులు అంచనా వేశారు.



విజన్ డాక్యుమెంట్‌లో రూపొందించిన సమాచారం ప్రకారం వివిధ రంగాల నుంచి రానున్న ఆదాయ పురోగతిని అధికారులు వేసిన అంచనాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయం, అనుబంధ రంగాల నుంచి 16.89 శాతం, పరిశ్రమల నుంచి 24.77, సర్వీసు రంగం నుంచి 58.34 శాతం వృద్ధి ఆదాయం వస్తుందని తేల్చారు. రాబోయే ఐదేళ్లలో మూడు ప్రధాన రంగాల్లో 100 శాతం వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అధికారులు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశారు. జిల్లాల పునర్విభజన తరువాత గ్రామీణ ప్రాంతం తగ్గి పట్టణ ప్రాంతాలు పెరిగాయి. అంతేగాక రాజధాని అమరావతి జిల్లా పరిధిలో ఉండటం వల్ల ఈ ప్రాంతంలో జరిగే అభివృద్ధి, నూతన నిర్మాణాల ద్వారా మరింత పురోగతి సాధించగలమని అధికారులు ధీమాగా ఉన్నారు. ప్రస్తుతం వస్తున్న స్థూల జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయం, అనుబంధ రంగాల ద్వారా ప్రతి ఏటా 9 నుంచి 11 శాతం వరకు పురోగతి సాధించగలమని నిర్ధారించారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన, పట్టుపరిశ్రమలు, పశుపోషణ, మత్స్య, ఆక్వా రంగాల ద్వారా ఈ పురోగతి సాధ్యం అవుతుందని డాక్యుమెంటేషన్‌లో పేర్కొన్నారు. మైనింగ్ క్వారీయింగ్ ద్వారా ఏటా 12 శాతం, వస్తువుల తయారీ రంగంలో 13 నుంచి 14 శాతం, విద్యుత్,గ్యాస్, నీటి సరఫరాలో 10 శాతం, నిర్మాణ రంగంలో 18 శాతం, పరిశ్రమలకు సంబంధించి 15 శాతం, రైల్వే ద్వారా 11 శాతం, రవాణా రంగంలో 14 శాతం, కమ్యూనికేషన్‌ల ద్వారా 15 శాతం, బ్యాకింగ్, పెట్టుబడుల

▶ 2లో

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఎమ్‌టిఎంసి పరిధిలో అభ్యంతరం లేని భూముల రెగ్యులరైజేషన్

అధికారులతో కలెక్టర్ సమావేశం - మార్గదర్శకాలపై సూచనలు

ప్రజాశక్తి-గుంటూరు

మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ (ఎమ్‌టిఎంసి) పరిధిలో ఆక్రమిత ప్రాంతాల్లోని నివాసాలు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం రెగ్యూలైజేషన్‌కు సంబంధిత శాఖలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళగిరి-తాడేపల్లి పరిధిలో ఆక్రమిత ప్రాంతాల్లోని నివాసాల రెగ్యులరైజేషన్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, రైల్వే, మున్సిపల్ అధికారులతో జేసీ ఎ.భార్గవతేజతో కలసి కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. ఎమ్‌టీఎంసీ పరిధిలో అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు, అభ్యంతరం ఉన్న పొరంబోకు, రహదారులు, రిజర్వ్ ఫారెస్ట్, రైల్వే, దేవాదాయశాఖ, వాటర్ బాడీస్ స్థలాల్లో రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో దాదాపు 16,025 నివాసాలు గుర్తించినట్లు అధికారులు వివరించారు. కేటగిరి వారీగా స్థలాలకు సంబంధిత శాఖల అధికారులతో స్థలాల రెగ్యూలైజేషన్‌కు ఉన్న అవకాశాలు, సడలించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, జెసి కొన్ని సూచనలు చేశారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్‌టీఎంసీ పరిధిలో అక్రమిత స్థలాలు రెవెన్యూ రికార్డు ప్రకారం ఉన్న స్థలాల కేటగిరిని పూర్తిస్థాయిలో పరిశీలించి స్థలాల రెగ్యూలజేషన్‌కు సడలించాల్సిన నిబంధనలపై నివేదిక అందించాలన్నారు. కేటగిరి 1, 2 కి సంబంధించిన స్థలాల్లో నివాసాలను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తనిఖీ చేసి వచ్చే మంగళవారం నాటికి పూర్తి స్థాయిలో నివేదిక అందించాలన్నారు. రహదారులు, శ్మశానాలు, రైల్వే, దేవాదాయశాఖ, అటవీ శాఖల స్థలాల్లోని ఇళ్లను సంబంధిత శాఖలు తనిఖీ చేసి

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు

26న కార్మిక-కర్షక ప్రదర్శనలు

- జయప్రదం చేయాలని ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు 26న జరిగే కార్మిక-కర్షక ట్రాక్టర్, బైక్ ర్యాలీలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని మేక అమరారెడ్డి భవన్‌లో ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను దెబ్బతీసే విధానాలను అమలు చేస్తోందని, రైతు ఉద్యమం సందర్భంగా ప్రధాని ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. దీనిపై పంజాబ్ రైతునేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ 57 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విధాన ముసాయిదాను వ్యతిరేకిస్తూ మన రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం

▶ 2లో

ప్రజల మౌలిక సమస్యలకు సోషలిజంతోనే పరిష్కారం

లెనిన్ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం అనివార్యమని, సోషలిజమే నేడు ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ పరిష్కారమని సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. సోవియట్ యూనియన్ విప్లవ సారధి లెనిన్ శతవర్ధంతి సభ గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షతన మంగళవారం జరిగింది. నర్సింగరావు మాట్లాడుతూ మార్క్స్, ఏంగెల్స్ రాసిన సిద్ధాంతాన్ని రష్యాలో సోషలిజం సాధించటం ద్వారా లెనిన్ ఆచరణలోకి తెచ్చాడన్నారు. ఆ తర్వాత యూరప్ ఖండలోని అనేక దేశాలు సోషలిస్టు దేశాలుగా ఆవిర్భవించి, ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తున్నాయన్నారు. నేడు చైనా అభివృద్ధిని ప్రపంచం ప్రత్యక్షంగా చూస్తోందని, అమెరికా దాడులను ఎదుర్కొంటూ సోషలిజాన్ని కమ్యూ కాపాడుకుంటోందని, ప్రపంచానికి వైద్యసేవలను విస్తరిస్తోందని చెప్పారు. ఇటీవల పెట్టుబడిదారీ విధానాలతో విసిగిన శ్రీలంక ప్రజలు సోషలిస్టు భావజాలం ఉన్న వారికి అధికారాన్ని ఇచ్చారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా

మాట్లాడుతున్న నర్సింగరావు

అన్ని దేశాల్లో సోషలిస్టు శక్తులకు ఆదరణ పెరుగుతుందన్నారు. లెనిన్ చెప్పిన విధంగా నిర్థిష్ట పరిస్థితులకు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అన్వయించటం ద్వారా భారతదేశంలో కార్మికవర్గ విప్లవాన్ని జయప్రదం చేయటానికి ప్రజల్ని చైతన్యవంతం చేయాల న్నారు. పెట్టుబడిదారీ సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పేదరికం వంటి మౌలిక సమస్యలకు సోషలిజమే సరైన ప్రత్యామ్నాయం అన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడుతూ అత్యంత ప్రజాస్వామ్య యుతమైన పాలనను సోషలిస్టు ప్రభుత్వాలు అందిస్తాయన్నారు. దేశంలో బిజెపి ఫాసిస్టు విధానాలు అనుసరిస్తోందని, ప్రజాస్వామ్యం లేదని, రాష్ట్రాల హక్కులను కుదిస్తోందని విమర్శించారు. గవర్నర్లను అడ్డుపెట్టుకొని రాష్ట్రాలపై పెత్తనం చేస్తుందన్నారు. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా ఆర్థికంగా అణచివేస్తోందని మండిపడ్డారు. కార్మికుల ఉపాధిని విస్మరించి, ఎఐ వంటి నూతన టెక్నాలజీని ప్రోత్సహిస్తే ఉత్పత్తి పోగుబడి, ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి సంక్షోభం వస్తుందని వివరించారు. నేతాజి మాట్లాడుతూ లెనిన్ చెప్పిన విధంగా నిర్థిష్ట పరిస్థితుల్ని అధ్యయనం చేయటంతోపాటు, మారుతున్న పరిస్థితులను అధ్యయం చేసి, అర్థం చేసుకోవటం కమ్యూనిస్టులకు ఎంతో అవసర మన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, ఎన్.భావన్నారాయణ, ఈ.అప్పారావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రీ సర్వేపై పల్నాడు జెసి సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో భూముల రీసర్వే పై జిల్లా అధికారులతో నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. రీ సర్వే పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో డిఆర్‌ఒ మురళి, ఆర్డీవోలు కె.మధులత, రమణాకాంత్‌రెడ్డి, మురళికృష్ణ, ఎడి సర్వేయర్ భానుకీర్తి పాల్గొన్నారు.

చైర్మన్ దృష్టికి వార్డుల్లో సమస్యలు

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని 8వార్డు రూప్ లైన్ కాలనీ ప్రాంతాల్లో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబు, టిడిని నాయకులు మద్దిగపు చిన్నవెంకట్రామిరెడ్డి మంగళవారం పర్యటించారు. తాగునీరు, డ్రెయినేజీ కాల్వలు, విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు, తదితర సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చైర్మన్ హామీనిచ్చారు.

26 నుండి యోగా, మెడిటేషన్ క్లాసులు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : రిపబ్లిక్ డేను పురస్కరించుకొని జనవరి 26 నుండి శ్రీ రామకృష్ణ సేవాసమితి మాచర్ల ఆధ్వర్యంలో యోగా, మెడిటేషన్ క్లాసులు ప్రారంభిస్తున్నట్లు సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మంగళవారం తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు శ్రీశైలం రోడ్‌లో గల స్వామి వివేకానంద సేవాశ్రమంలో ఈ క్లాసులు ప్రారంభమవుతాయని, ప్రతిరోజూఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు 30 రోజులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కర్నూలుకు చెందిన ప్రముఖ మెడిటేషన్ నిపుణులు టి.ఇందిరాదేవి ఆధ్వర్యంలో క్లాసులు ఉంటాయని, ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే అవకాశం అభిస్తునందని, బుధవారం లోపు ఫోన్ ద్వారా నమోదు చేసుకోగలని కోరారు. మరింత సమాచారం కోసం 9440006813, 9346162835 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

తాళ్లూరులో సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెదకూరపాడు : మండలంలోని తాళ్లూరు జంగాల కాలనీ, గంటా వారి వీధి, బీసీ కాలనీల్లో రూ.40 లక్షలతో సిసి రోడ్లకు టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్, అధికారులు మంగళవారం శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దాతల సహకారంతో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న కళ్యాణ మండపం పనులను పరిశీలించారు. స్థానిక జెడ్‌పి పాఠశాలలో రూ.23 లక్షలతో స్టాఫ్ రూమ్‌కు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బి.రామ్‌గోపాల్‌రావు, జి.బాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వి.అప్పారావు, అజుముల్ల, సాగర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మహిళల అక్షరాస్యతతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - దాచేపల్లి : డ్వాక్రా మహిళలు విద్యావంతులైనప్పుడే సమాజం ప్రగతి పథంలో పయనిస్తుందని ఎంపిఎ రవికుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఈ-ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో వెలుగు బీసీలు వెంకటేశ్వర్లు, మురళి మోహన్, జోష్న, మండల సమాఖ్య అధ్యక్షులు కటికాల సునీత, కార్యదర్శి శ్రీపతి బుజ్జి పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూముల రీసర్వే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో భూముల రీసర్వే కొనసాగుతోంది. రెండ్రోజులుగా 14 గ్రామాల్లో సర్వే ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో మండలానికి ఒక గ్రామం చొప్పున 14 మండలాల్లో 14 గ్రామాలను ఎంపిక చేశారు. రోజుకు 20 ఎకరాలు మాత్రమే రెవెన్యూ సిబ్బంది రీసర్వే చేపట్టారు. సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.పవన్ కుమార్ ఆధ్వర్యంలో లచ్చన్నగుడిపూడి (తాడికొండ), మందపాడు (మేడికొండూరు), వడ్డమాను (తుళ్లూరు), జడవల్లి (పొన్నూరు), పెరికలపూడి (దుగ్గిరాల), మంచాల (చేబ్రోలు), పాండ్రపాడు (కాకుమాను), మెరికపూడి (ఫిరంగిపురం), మల్లాయపాలెం (ప్రత్తిపాడు), అనమర్లపూడి (పెదకాకాని), చినపలకలూరు (గుంటూరు పశ్చిమ), పెదరావూరు (తెనాలి), జొన్నలగడ్డ (గుంటూరు తూర్పు), కుంచవరం (కొల్లిపర) సర్వే ప్రారంభించారు.

14 గ్రామాల పరిధిలో 6695 రైతులకు చెందిన 26,329 ఎకరాలను సర్వే చేయనున్నారు. ఒక్కో గ్రామంలో 200 నుంచి 250 ఎకరాలను తొలుత సర్వే చేయాలని నిర్ణయించామని పవన కుమార్ తెలిపారు. సర్వేలో తొలి విడతగా ప్రభుత్వ భూములు, చెరువు, పోరంబోకు భూములు, అసైన్డ వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. ప్రధానంగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ, చెరువు, కుంటలు, పోరంబోకు భూములు వివరాలను ఇప్పటికే ఎంపిక చేశారు. ఇప్పటికే 14 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో మొత్తం 173 గ్రామాలు ఉండగా గత ప్రభుత్వ హయంలో 62 గ్రామాల్లో సర్వే పూర్తయింది. 64 గ్రామాల్లో అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. ఈ సమస్యలపై రెవెన్యూ సదస్సులో ఇటీవల వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలిస్తున్నారు. సర్వే బృందాలు ఆయా భూ యజమానులకు ముందుగా నోటీసు ఇవ్వడం, భూ యజమానితో పాటు ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇవ్వడం, గ్రామంలో ఉన్న రైతులందరికి కలిపి వాట్సాప్ గ్రూపు రూపొందించడం, తహశీల్దార్, సర్వేయర్లు గ్రామాన్ని సందర్శించి రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు.

మేడికొండూరు మండలం మందపాడులో అధికారులు సర్వే

వేస్ట్ టుఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన మంత్రి రవికుమార్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గుంటూరులోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌ను మంత్రి మంగళవారం సందర్శించారు. చెత్తను ప్రాసెసింగ్ చేసి, విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రక్రియను మంత్రికి అక్కడి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ఈ ప్లాంట్‌లో విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లోని మూడు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీల నుంచి చెత్తను సేకరించి గంటకు 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు. పర్యావరణహితం కోసం ఇలాంటి ప్లాంట్లు మరిన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి రావాలన్నారు. ఢిల్లీ తరువాత ఇలాంటి ప్లాంట్లు కేవలం ఏపీలోనే ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిందాల్ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ ఎంవీ చారీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరావతిపైనే ఆశలు!

(మొదటి పేజీ తరువాయి)

రంగంలో 14, రియల్‌ఎస్టేట్ రంగంలో 20 శాతం, పరిపాలన రంగంలో 18, ఇతర రంగాల నుంచి 16.65 శాతం, సేవా రంగం నుంచి 16.65 శాతం వృద్ధి సాధించగలమని అంచనా వేశారు.

పన్నుల వసూళ్లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న 9.53 శాతం నుంచి 15.69 శాతం పురోగతి వుంటుందని అంచనా వేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. జనాభా పెరుగుదల మాత్రం స్వల్పంగా ఉంటుందని, తలసరి ఆదాయం గరిష్టంగా ఐదేళ్ల లో 15.49 ఉంటుందని అంచనా వేశారు. అంతేగాక జిల్లాలో రాజధాని ప్రాంతంలో రైతులు ఇచ్చిన 34 వేల ఎకరాలతో పాటు ప్రభుత్వ భూములు, ఇతర భూములు కలిపి 2014 నుంచి వ్యవసాయం ఉపసంహరించబడింది. దీంతో దాదాపు 50 వేల ఎకరాల్లో వ్యవసాయం తగ్గింది. మంగళగిరి, తాడేపల్లి మండలాలలోని గ్రామాలన్నీ కూడా మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో చేర్చడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం పెరిగింది. వ్యవసాయ భూములు తగ్గాయి. అంతేగాక జిల్లాలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర రంగాలకు మళ్లించడం వల్ల ఇతర రంగాల ద్వారా వచ్చే ఆదాయం అంతా సేవా రంగం ద్వారానే వస్తాయని అంచనా వేస్తున్నారు. రానున్న ఐదేళ్లలో ఏటా అన్ని రంగాల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించే లక్ష్యంతో నూతనంగా నిర్ధేశించుకున్న విజన్ -2047 ప్రణాళికల అమలుకు మండల స్థాయి నుంచి రంగాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న వనరులు, వివిధ రంగాల్లో వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో ప్రజా భాగస్వామ్యంతో సదస్సులు నిర్వహించి ప్రజల ద్వారా అభిప్రాయసేకరణ కూడా చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల ద్వారా ఏటా 15 శాతం వృద్ధి సాధించాలని, ఐదేళ్లలో వృద్ధి ప్రస్తుతం ఉన్న దాని కన్నా రెట్టింపు కావాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్ధేశించింది.

వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు ప్రతి ఏటా క్షీణిస్తోంది. కాగితాల్లో గణాంకాలు చెప్పుకోవడానికి గొప్పగా ఉన్నా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. సాగు విస్తీర్ణం ప్రతి ఏటా గణనీయంగా తగ్గిపోతోంది. ప్రభుత్వం నుంచి ఆశించిన ప్రోత్సాహకాలు సబ్సిడీలు తగ్గడంతో పాటు ఉత్పత్తులు చేతికి వచ్చే సమయానికి ధరలు తగ్గిపోవడం, ఉత్పత్తులన్నీ రైతుల నుంచి దళారీల చేతుల్లోకి వెళ్లిన తరువాత ధరలు పెరగడం పరిపాటిగా మారింది. భూ యజమానుల కంటే కౌలు రైతులే ఎక్కువగా పంటలను సాగు చేస్తున్నారు. కౌలు రైతులకు కనీస ఆదరణ, గుర్తింపు లేదు. దీంతో సాగు సంక్షోభంలో చిక్కుకుంటోంది. ప్రతిఏటా సాగు భూమి విస్తీర్ణం తగ్గిపోవడం పరిపాటిగా మారింది. ప్రధానంగా ఈ తగ్గుదల గత ఐదేళ్లలో మరింత పెరిగింది. 15 నుంచి 20 శాతం విస్తీర్ణం తగ్గడం, లక్షలాది ఎకరాలు ఎలాంటి పంటలు వేయకుండా ఉండటం గత 10 ఏళ్లుగా క్షీణతను తెలియచేస్తున్నాయి. ప్రధానంగా ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల వృద్ధి రేటు పెరుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అధికారులు అంతర్గతంగా అంగీకరిస్తున్నారు. రాజధాని ప్రాంతం కావడంతో జిల్లాలో వ్యవసాయ భూమి వివిధ అవసరాల పేరుతో మళ్లిస్తున్నారు. 2014లో ఉమ్మడి జిల్లాలో 15 లక్షల ఎకరాల్లో సాగు జరగ్గా ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో 10 లక్షల ఎకరాల్లోనే సాగు జరుగుతోంది. ప్రధానంగా రియల్ ఎస్టేట్ రంగానికి ఎక్కువా భూ మార్పిడిలు జరిగాయి. జిల్లాలో తాడికొండ, మంగళగిరి, పెదకూరపాడు, తెనాలి నియోజకవర్గాల్లో దాదాపు లక్ష ఎకరాల్లో గత 10 ఏళ్లలో క్రమంగా వ్యవసాయం నుంచి భూములను ఇతర అవసరాలకు మళ్లించారు. ఒక వైపు ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల ప్రభావం, మరో వైపు పెట్టుబడులు భారీగా పెరగడం, ఆంక్షల పేరుతో రైతుల నుంచి ప్రభుత్వ సంస్థలు సకాలంలో ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఏ పంట సాగు చేసినా లాభాలు వస్తాయన్న నమ్మకం లేకుండా పోయింది. వ్యవసాయ రంగంలో ఏటా 15 శాతం వృద్ధి సాధించడానికి రైతులకు ప్రోత్సహకాలు, మద్దతు ధరల కల్పన, సకాలంలో కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాల బారిన పడితే తక్షణ సాయం, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు అందించగలిగితే వృద్ధి రేటు కొంత వరకు మెరుగుపడుతుందని వ్యవసాయ అధికారులు, రైతు ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

26న కార్మిక-కర్షక ప్రదర్శనలు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం మండల కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, రుణమాఫీ అమలు చేయాలని, నూతన మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలని, 60 ఏళ్లు దాటిన కార్మిక, కర్షకులకు రూ.10 వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలని, విద్యుత్ సంస్కరణ బిల్లు రద్దు చేయాలని కోరారు. సిఐటియు పట్టణ నాయకులు బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. ఎఐటియుసి నాయకులు కె.కాశయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే విధంగా బిజెపి వ్యవహరిస్తోందని, మనువాద సిద్ధాంతాన్ని అమలుకు పూనుకుందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా సాకే కార్మిక-కర్షక ప్రదర్శనలో అన్ని రంగాల ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు డి.వెంకటరెడ్డి, పి.కృష్ణ, బి.కోటిరెడ్డి, ఇ.రామారావు, గాంధీ, భక్కిరెడ్డి, కె.కరుణాకరరావు, బి.దశరథరెడ్డి, డి.విజయభాస్కరరెడ్డి, బి.గోపాలరావు, పి.లక్ష్మీనారాయణ, శామ్యూల్, టి.వెంకటయ్య, శ్రీరామ్, శ్రీను, దుర్గారావు, శాస్త్రి పాల్గొన్నారు.

అభ్యంతరం లేని భూముల రెగ్యులరైజేషన్

(మొదటి పేజీ తరువాయి)

నివేదించాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులందరూ తదుపరి వారంలో జరిగే సమావేశానికి నిర్దేశించిన మేరకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. యూజీడీ ట్రీట్మెంట్ ప్లాంట్, తాగునీటి పంపింగ్ ప్లాంట్ ఏర్పాటుకు, ఈటెస్ట్రీట్‌కు, స్మార్ట్ మార్కెట్ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన స్థలాలు అందించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీల మేరకు ఎమ్‌టీఎంటీసీ పరిధిలో అక్రమిత స్థలాల్లో నివాసాలను రెగ్యులరైజేషన్ చేసేందుకు ఇప్పటికే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే చేశామన్నారు. అభ్యంతరంలేని ప్రభుత్వ పోరంబోకు, అభ్యంతరం ఉన్న పోరంబోకు, రహదారులు, రిజర్వ్ ఫారెస్ట్, రైల్వే, దేవాదాయశాఖ, వాటర్ బాడీస్‌లో ఉన్న స్థలాల్లో నిర్వహించిన సర్వేలో గుర్తించిన నివాసాల లబ్ధిదారుల పూర్తి వివరాలు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే సేకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వేకు సంబంధించిన స్థలాల్లో అక్రమణలపై రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్త సర్వే నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జెడ్పీ సిఇఒ వి.జ్యోతిబసు, ఎమ్‌టీఎంసీ కమిషనర్ అలీంబాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 3
బుధవారం 22 జనవరి 25

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు : లీడ్‌బ్యాంక్ మేనేజర్

ప్రజాశక్తి-గుంటూరు

గుర్తింపు కార్డులు పొంది, భూ యజమానులు రుణాలు తీసుకోకుండా ఉన్న వారందరికీ ప్రస్తుత రబీలో పంట రుణాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి తెలిపారు. గుంటూరు రూరల్, జొన్నలగడ్డలో వ్యవసాయశాఖ, బ్యాంక్ ,రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులుతో సమావేశం జరిగింది. సమావేశానికి మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డిఎం మాట్లాడుతూ భూ యజమానులు కౌలు రైతులకు సహకారం అందిస్తే బ్యాంకు రుణాలు అధిక మొత్తంలో ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులకు రుణాలు పొందేందుకు భూ యజమానులు కూడా సహకరించాలన్నారు, ఎటువంటి అపోహాలు అవసరం లేదన్నారు. జిల్లాలో 40,000 మంది గుర్తింపు కార్డులు పొందితే అందులో 12 వేల మంది భూ యజమానులు రుణాలు పొందలేదని, వారందరికీ రుణాలు వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఎటువంటి షూరిటీ లేకుండా భూమిలేని కౌలు రైతులకు గ్రూపుల ద్వారా రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ మాట్లాడుతూ నిజమైన సాగుదారులైన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు పొందలేక ప్రవేటు వడ్డీల ద్వారా అధిక వడ్డీలు చెల్లిస్తూ పండిన పంటలకు మద్దతు ధర లేక కుటుంబాల అప్పులు పాలవుతున్నారన్నారు. కావున బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు మంజూరు చేయాలని కోరారు. గోరంట్ల యూనియన్ బ్యాంక్ మేనేజర్ చాలా ఇబ్బందుకు గురి చేస్తున్నారని కౌలు రైతులు, రైతులు వాపోయారు. బ్యాంక్ మేనేజర్ స్పందిస్తూ జొల్లగడ్డ గ్రామానికి చెందిన రైతులు ఎకౌంట్లు గోరంట్ల బ్యాంకు నుండి జొల్లగడ్డ బ్రాంచ్‌కి మార్చుటానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి క్షేత్రస్థాయి సమావేశాలకు ముందుకొచ్చిన ఎల్‌డిఎంకు అజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం.శిరీష, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి

24న ఎమ్మెల్సీ అభ్యర్థి కెయస్ లక్ష్మణరావు ఆత్మీయ సమావేశం

తెనాలిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.యస్. లక్ష్మణరావు ఆత్మీయ సమవేశపు పోస్టర్‌ను తెనాలి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. జనవరి 24న నిర్వహించనున్న లక్ష్మణరావు ఆత్మీయ సమావేశాన్ని పెద్ద యెత్తున విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటి చైర్మన్ యం. హనుమంతరావు, యు.టి.ఎఫ్. జిల్లా అద్యక్షులు రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శ యం కళాధర్, జిల్లా కోశాధికారి గయాసుద్దేలా జిల్లా కార్యదర్శులు సాంబశివరావు, కేదారనాథ్, సిఐటియు నాయకులు కొల్లిపర బాబూప్రసాదు, షేక్ హుస్సేన్ వలి, తెనాలి టౌన్ అధ్రక్షురాలు పి.సౌజన్య, స్వరూప, బసవిశ్వేరరావు వరప్రతాప్, హనుమంతరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. తెనాలి మండల శాఖ అద్యక్షులు యం అయూబ్, అన్సారి, ప్రధాన కార్యదర్శి యన్. రాంబాబు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణలో యుటిఫ్, సిఐటియు నాయకులు

కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

ప్రభుత్వ సర్వేలు వేగవంతం చేయాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలను వేగవంతం చేయాలని, నోడల్ అధి.కారులు కార్యదర్శులు చేస్తున్న సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అడ్మిన్ కార్యదర్శులు, నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మంది రంలో సచివాలయాల కార్యదర్శులు, నోడల్ అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ తొలుత కార్యదర్శుల వారీగా మిస్సింగ్ సిటిజెన్స్, పి.ఏ.సి.యస్, హౌసింగ్ జియోట్యాగ్, యన్.పి.సి.ఐ, నాన్‌రెసిడెంట్ ఇన్ ఏ.పి, యం.యస్.యం.ఈ సర్వేల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వేల వేగవంతంపై కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్లు ప్రత్యేక దష్టి సారించి గురువారం నాటికి పూర్తి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సిటిజెన్ డేటాబేస్‌ను సిద్ధం చేయడానికి, సూక్ష్మ, మధ్యతరగతి వ్యాపార సంస్థలకు రాష్ట్ర, కేంద్ర సంక్షేమ పథకాలు అమలు చేయడానికి సర్వేలు చేస్తున్నామన్నారు. సర్వేకు నగర ప్రజలు పూర్తి స్తాయిలో సహకరించి సచివాలయ కార్యదర్శులకు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. సదరు సమావేశంలో అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమీషనర్ డి.శ్రీనివారావు,సెక్రటరీ పి.శ్రీనివాసరావు, ఆర్.ఓ రెహమాన్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య కార్మికుల హాజరు నమోదు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు మస్టర్ సమయంలో తప్పనిసరిగా ప్రజారోగ్యకార్మికుల హాజరు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ నాజ్‌సెంటర్ రిజర్వాయర్ లోని మస్టర్ పాయింట్లను ఆకస్మిక తనిఖీ చేసి, కార్మికులు, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి, మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టడానికి తగిన ఆదేశాలు జారీచేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికుల హాజరును సచివాలయ శానిటేషన్ కార్యదర్శులే తీసుకోవాలన్నారు. కార్మికులు అత్యవసరమైతే తప్ప సెలవులకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. శానిటేషన్ డివిజన్ల వారీగా పారిశుధ్య పనులకు అవసరమైన పుష్ కాట్స్, డంపర్‌బిన్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించి, కార్మికులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. అనంతరం కావేరి నగర్, నగరంపాలెం దర్గా వెనుక రోడ్, ఐపిడి కాలనీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన డ్రైన్లలో మురుగు పారుదల సక్రమంగా ఉండడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్మాణ సమయంలో లెవల్స్ పాటించాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. పర్యటనలో డిఈఈ మధుసూదనరావు, ఆర్‌ఓ మదన్ గోపాల్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

శాఖమూరులో అక్రమంగా సాగు చేస్తున్న పంటల తొలగింపు

40 ఎకరాలు దున్నేసారు

రాజధానిలో పూలింగ్ భూముల్లో పంటలు వేయద్దు :సిఆర్‌డిఎ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని శాఖమూరు గ్రామంలో సిఆర్‌డిఎ భూముల్లో అక్రమంగా సాగు చేస్తున్న పంటలను అధికారులు దున్నివేశారు. సుమారు 40 ఎకరాలలో పంటలు సాగుచేస్తు న్నారని అధికారులు చెబుతున్నారు. రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చిన భూముల్లో పంటల సాగు చేపట్టవద్దని సిఆర్‌డిఎ అధికారులు ఇటీవల రాజధాని గ్రామాల్లో మైక్ ప్రచారం నిర్వహించారు. అక్రమంగా పంటలు సాగు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ శాఖమూరులో కొంతమంది మినుము, కంది తదితర పంటలు సాగు చేస్తుండడంతో అధికారులు మంగళవారం పంటల తొలగింపు చర్యలు చేపట్టారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రోక్లైనర్ తో పంటలను తొలగించారు.

విద్యార్థికి సైకిల్ అందచేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తనకు సైకిల్ కొని ఇవ్వాలంటూ ఒక విద్యార్థి కోరిన కోరికను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నేరవేర్చారు. ఇటీవల తెనాలి మండలం నందివెలుగులోని జడ్పీ హైస్కూల్ లో నూతన భవనాలను ప్రారంభించే ందుకు వెళ్లిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాఠశాల విద్యార్థి మందా శరత్ బాబు తాను రెండు కిలో మీటర్ల దూరం నుంచి వస్తున్నానని సైకిల్ కావాలని అడిగాడు. ఇందుకు పెమ్మసానిస్పందిస్తూ.. "నువ్వు బాగా చదువుకుంటానని మాట ఇస్తే సైకిల్ కొనిస్తాను." అని చెప్పిన రెండు రోజుల్లోనే విద్యార్థికి ఇంటికి ఒక నూతన సైకిల్ ను కొని ఇచ్చి పంపించారు. దీంతో విద్యార్థి, అతని తల్లిదండ్రులు పెమ్మసానికి దన్యవాదాలు తెలిపారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 238 మందికి అర్హత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు మంగళవారం దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. స్థానిక పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ పరీక్షలకు 760 మంది హాజరు కాగా వారిలో 98 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 662 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించారు. మరో ముగ్గురు సోమవారం ఆలస్యంగా వచ్చిన వారు కూడా మంగళవారం హాజరు అయ్యారు. మొత్తం 665 మంది అభ్యర్థులకు గాను కొలతల దశలోనే 83 మంది అనర్హులయ్యారు. మిగిలిన 582 మందికి 581 మంది 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 249 మంది అనర్హులు కాగా 414 మంది తదుపరి పరీక్షల కొరకు అర్హత సాధించారు. కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్‌పి సతీష్‌కుమార్, అదనపు ఎస్‌పిలు సుప్రజ, రమణమూర్తి తదితరులు పరిశీలించారు.

అనారోగ్యంతో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల

అనారోగ్యంతో యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. పట్టణంలోని పదవ వార్డుకు చెందిన తాళ్లూరి శ్రీనివాసచారి కుమార్తె అలేఖ్య (19) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆలేఖ్య పట్టణంలోని ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. అనారోగ్య కారణాలతోనే అలేఖ్య ఉరి వేసుకొని చనిపోయినట్లు తండ్రి పోలీసులకు తెలిపారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకున్నది. కొంత సమయానికి తల్లిదండ్రులు చూసి హాస్పిటల్ కి తీసుకొచ్చే సమయానికే మృతిచెందింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - దాచేపల్లి

రైలు ఢీ కొట్టి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో జరిగినది. రైల్వే పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో ఏదో గుర్తుతెలియని రైలు ఢీకొనటంతో వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయని రైల్వే సిబ్బంది సమాచారం అందింది. నడికుడి రైల్వే స్టేషన్ ఏ ఎస్ ఐ వెంకట్రావు చికిత్స నిమిత్తం గుంటూరు జనరల్ హాస్పిటల్ కు అంబులెన్స్ ద్వారా తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ మార్చరీలో భద్రపరిచారని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు లేక ఇతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే నడికుడి ఏఎస్ఐ ఏ వెంకట్రావు.7780171069, లేదా కానిస్టేబుల్ ఎస్ రామరాజు కు9949063960 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

మండాదిలో ఎద్దులు చోరీ

ప్రజాశక్తి- మాచర్ల :

రెండు ఎద్దులు చోరీకి గురైన ఘటన వెల్దుర్తి మండలం మండాది గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పులి వెంకటరెడ్డి తన రెండు ఎద్దులను మేపుకొని వచ్చి సోమవారం రాత్రి కొట్టంలో కట్టివేసి మంగళవారం ఉదయం లేచి చూచేసరికి ఎద్దులు కనపడలేదు. గుర్తుతెలియని వ్యక్తులు తన ఎద్దులను దొంగిలించి ఉంటారని భావించిన వెంకటరెడ్డి వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎద్దుల విలువ సుమారు లక్షన్నర వరకు ఉంటుందని అంచనా.

హత్యాయత్నం కేసులో ముద్దాయి అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్‌కు చెందిన అటెంటు మర్డర్ కేసులో ముద్దాయి షేక్ మీరా అలియాస్ ఆసిఫ్‌ను మంగళవారం తాడేపల్లి ఎస్సై జె శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. ఈ మేరకు తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో ముద్దాయిని హాజరపరిచారు. షేక్ ఆరిఫ్ అలియాస్ మహబూబ్‌ను, తన అన్నయ్య షేక్ మీరా అలియాస్ ఆసిఫ్ డిసెంబర్ 12వ తేదీ పాత కక్షల నేపథ్యంలో కూరగాయలు కోసుకునే చాకుతో పొడవడంతో మీరా కళ్ళు తిరిగి పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వాళ్ళు 108 కి ఫోన్ చేసి, విజయవాడలోని గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం తన అన్నయ్య మీరా పై ఇచ్చిన రిపోర్టు మేరకు ముద్దాయిని తాడేపల్లి పోలీసుల అరెస్టు చేశారు.

వనికుంటలో రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని వనికుంట గ్రామంలో రెండు పూరిళ్లు అగ్నికి ఆహ్యూతయ్యాయి. గ్రామానికి చెందిన బచ్చనబోయిన ఆంజనే యులు తల్లి నరసమ్మ ఇంట్లో మోటార్ స్విచ్ ఆన్ చేయగా షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న గడ్డివాముకు మంటలు వ్యాపించి సమీపంలోని గేదెలు మంటల్లో చిక్కుకొని ఒక గేద మృతి చెందగా ఐదుగేదలకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న షేక్ నన్నేసా ఇంటికి మంటలు అంటుకొని ఇల్లు పూర్తిగా కాలి బూడిదయ్యింది. ధాన్యం అమ్ముకోగా వచ్చిన రెండు లక్షల నగదు, 56 గ్రాముల బంగారం మంటల్లో కాలిపోయాయని బచ్చన బోయిన ఆంజనేయులు కుటుంబం సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాద బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. అగ్నిమాపక శాఖ వారు ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. పశు వైద్య ప్రాంతీయ సహాయ సంచాలకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైద్యులు వి గోపాల్ నాయక్ గేదెల శరీర గాయాలకు చికిత్స అందించారు. ఎస్‌ఐ ఎం ఉమామహేశ్వరరావు ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. గ్రామ రెవెన్యూ అధికారి వి శ్రీనివాసరావు బాధితులకు 30 కేజీల బియ్యం, 2కేజీ ల కందిపప్పు,కేజీ పంచదార అందజేశారు.

కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించిన యోధుడు లెనిన్

101వ వర్ధంతి సభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మికవర్గ రాజ్యం స్థాపన కోసం కార్ల్‌మార్క్స్, ఫెడరిక్ ఏంగెల్స్ సిద్ధాంతాలకు ఆచరణ రూపం ఇచ్చిన సోవియట్ యూనియన్ విప్లవ సారథి లెనిన్ అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో లెనిన్ 101వ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్ర పటానికి విజయ్ కుమార్ పూల మాలలేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం నరసరావుపేట మండల కన్వీనర్ డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించిన

లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్, ఇతర నాయకులు

సభలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ సోవియట్ రష్యా విప్లవ నేపథ్యం, లెనిన్ పాత్రను వివరించారు. కార్పొరేట్ దోపిడీ ప్రభుత్వాల స్థానంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాల ఏర్పాటుకు కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ కష్టజీవుల రాజ్యాన్ని నిర్మించిన మహానేత లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నివాళి అన్నారు. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళల హక్కుల కోసం సంఘాలు పెట్టాలని లెనిన్ తొలిగా ప్రతిపాదించారని తెలిపారు. బలమైన కమ్యూనిస్టు పార్టీని ఎలా నిర్మించాలో తన రచనల ద్వారా చెప్పారన్నారు. లెనిన్ స్ఫూర్తితో నేడు దేశంలో, రాష్ట్రంలో పాలక పార్టీలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదామన్నారు. సభలో నాయకులు టి.పెద్దిరాజు, షేక్ సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, కె.హను మంతరెడ్డి, జి.బాలకృష్ణ, బి.వెంకటేశ్వర్లు, కె.కోటేశ్వరరావు, శివరామకృష్ణ, అప్పిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పి.వెంకటేశ్వర్లు, ఎం.ఆంజనేయులు, గాంధీ స్మారక సమితి నాయకులు ఈదర గోపిచంద్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కూరగాయలు సాగు చేసినా నష్టాల గాయమే

ప్రజాశక్తి - దాచేపల్లి

వాణిజ్య పంటలు సాగుచేస్తే నష్టాలొస్తున్నాయని కూరగాయలు సాగు చేస్తే అవి కూడా నష్టాల పాల్జేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. మార్కెట్లో టమాటా ధరలు పడిపోవడంతో రవాణా ఖర్చులు భరించలేదని రైతులు వాటిని రోడ్డు మీదే అమ్ముకుంటున్నారు. మరికొందరూ ఊరూరూ వెళ్లి కిలో రూ.10 చొప్పున అమ్ముకుంటున్నారు.

కేశనపల్లి ఎడ్ల జతకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి- దుర్గి

మండల కేంద్రమైన దుర్గిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీల్లో భాగంగా మంగళవారం పోటీలను ఎంపీపీ ఏచూరి సాయి సునీత సాయి శంకర్, బిజెపి నాయకులు కూనిశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఎనిమిది ఎడ్ల జతలు పాల్గొనగా దాచేపల్లి మండలం కేశనపల్లికి చెందిన నెల్లూరు రామకోటయ్య ఎడ్ల జత నిర్ణీత సమయానికి 4915 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానాన్ని సాధించాయి. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం అనంతపురానికి చెందిన పెడవల్లి బ్రదర్స్ ఎడ్ల జత 4750 అడుగులతో రెండో స్థానంలో, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తుర్లపాడుకు చెందిన పోపూరి ఆదినారాయణ, బాపట్ల జిల్లా ఎ.పంగులూరు మండలానికి చెందిన చిలుకూరి నాగేశ్వరరావుకు చెందిన కంబైన్డ్ జత 4678 అడుగులతో మూడో స్థానంలో నిలిచాయి. ఎడ్ల యజమానులను గద్దె సత్యం సత్కరించారు.

పనులు చేపట్టని ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజులు

ప్రజాశక్తి - రెంటచింతల

ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని డ్వామా పీడీ ఎస్.లింగమూర్తి ఆదేశించారు. రూ.1.19 లక్షలతో చేపట్టిన మండలంలోని దశబందు కాల్వ మరమ్మతులను మంగళవారం పరిశీలించిన ఆయన ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఇంకా పనులు చేపట్టని గోలి, మెట్టగుడిపాడు, పాలువాయి, పాలువాయిగేటు తదితర గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ కె.సరోజిని, ఏపీవో జయచంద్ర, ఏపీ డి.మల్లికార్జున పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని నెహ్రూనగర్, గుంటూర్ రోడ్డు ప్రాంతంలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు రోడ్డు ఏరియాలో 11 కెవి లైన్లో మెయింటెనెన్స్ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భూములిచ్చి కూలీలయ్యాం.. ఉపాధి కోసం ఎదురు చూస్తున్నాం..

- చదివిన తమ పిల్లల వయసు మీరుతోంది
- గ్రామ సభలో మైహోం సిమెంట్స్ బాధిత రైతుల ఆవేదన
- ఫ్యాక్టరీ పెట్టే వరకూ భూముల సాగుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్
- సభకు గైర్హాజరైన కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి - దాచేపల్లి

తామిచ్చిన భూముల్లో ఫ్యాక్టరీ నిర్మాణం చేయనందున సాగు చేసుకుంటామని అధికారుల ద్వారా సమాచారం పంపినా మై హోమ్ సిమెంట్స్ నుండి స్పందన లేకపోవడం అంటే తమను కించపరచడమేనని గ్రామ సభలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశమై మండలంలోని గ్రామాలపాడులో బాధిత రైతులు, కంపెనీ ప్రతినిధులతో అధికారులు మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. బాధిత రైతులతోపాటు రెవెన్యూ, పోలీసు అధికారులు హాజరైనా ఫ్యాక్టరీ ప్రతినిధులు మాత్రం హాజరవలేదు. భూముల విషయంలో గతనెల 17న కలెక్టర్‌కు, ఈనెల 3న తహశీల్దార్‌కు రైతులు విన్నవించగా ఈనెల 21న మైహోం ప్రతినిధులతో చర్చలకు అధికారులు నిర్ణయించారు. కంపెనీ నుండి ఎవరూ రాకపోవడం గమనార్హం.

ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ పేరుతో 900 ఎకరాలను కారుచవగ్గా 20 ఏళ్ల

సభలో మాట్లాడుతున్న తహశీల్దార్ కుటుంబరావు

కిందటే (2004) తీసుకున్నారని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటైతే స్థానికులకు ఉద్యోగాలొచ్చి గ్రామం అభివృద్ధి చెందుతుందని భావించామని, భూములను కోల్పోయిన తాము కూలీలుగా మారినా పిల్లల్ని బాగా చదివించి అవకాశాల కోసం నిరీక్షిస్తున్నామని, ఇప్పుడు వారి వయసూ మీరిపోతోందని చెప్పారు. ఆ భూమే తమ వద్ద ఉంటే తమతోపాటు ఒక్కోరైతు 10 మంది కూలీలకు పని కల్పించేవాడని అన్నారు. ఇప్పుడు తమ పొలాలు అడవులను తలపిస్తున్నాయని, అందులోని జంతువులు ఇతర పొలాలను నాశనం చేస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తమ భూముల్లోని పంట కాల్వలను, బోర్లనూ మైహోం యాజమాన్యం ధ్వంసం చేయించిందని మండిపడ్డారు. ఫ్యాక్టరీ కోసం గామాలపాడు, ఇరికేపల్లి గ్రామాల్లోని పొలాలిచ్చిన అనేక మంది రైతులు నేడు అప్పుల పాలయ్యారని, తమ పొలాలను తాము సాగు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని, ఫ్యాక్టరీ పెట్టాక పొలాలను ఖాళీ చేస్తామని అన్నారు. ఇదిలా ఉండగా ఇతర రైతుల భూములు సైతం ఆన్‌లైన్‌లో మైహోం సిమెంటు పేరుతో నమోదయ్యాయని, రెవెన్యూ అధికారులకు విన్నవించినా పరిష్కరించకుండా యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మొత్తం 24 అంశాలతో కూడిన డిమాండ్లను అధికారులకు వినతిపత్రంగా రైతులిచ్చారు.

తహశీల్దార్ కుటుంబరావు మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులకు తాము ఫోన్ చేసినా స్పందించలేదని, రైతుల సమస్యలను ఆర్‌డిఒ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇతర చర్యలు తీసుకుంటామన్నారు. సభలో ఎస్సై సౌందర్య రాజన్, ఆర్‌ఐ కుమార్, వీఆర్వో నాగేశ్వరరావు, బాధిత రైతులు బొమ్మ కోటేశ్వరరావు, సుధీర్, రోళ్ల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, జానీ, వెంకట్ నర్సయ్య, నరసింహారావు, వాళ్ల నవజ్యోతిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా

ఎస్.వెంకటరామయ్య

ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పి ఎకరం పొలాన్ని రూ.50 వేలకు తీసుకున్నారు. అప్పటి నుండి ఉద్యోగం కోసం ఎదురు చూస్తూ గ్రామంలోనే చిన్నచిన్న పనులు చేసుకుంటూ రోజులు నెట్టుకొస్తున్నా.

మా భూములూ ఫ్యాక్టరీ పేరుతోనే..

ఆర్.శ్రీనివాసరావు

గామాలపాడులో మైహోం సిమెంట్స్ తీసుకున్న భూములను ఆనుకుని ఉన్న మా పొలాలు కూడా ఆన్‌లైన్ అండంగల్ 1బిలో ఆ ఫ్యాక్టరీ పేరుతో మార్చారు. రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ ఏడాదిగా తిప్పించుకుంటున్నారు.

సమస్యలపై పోరాడే కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకుందాం

ఆత్మీయ సమావేశంలో ప్రజా సంఘాల ఉద్ఘాటన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ఉద్యోగ, ఉపాధ్యాయ, రైతు, కార్మికుల సమస్యలపై నిత్యం ప్రభుత్వంపై వత్తిడి తేవడంతోపాటు ఆయా వర్గాల ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని పరిష్కారానికి కృషి చేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుచోవాల్సిన అవసరం ఉందని ప్రజా సఘాల నాయకులు ఉద్ఘాటించారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా స్థానిక పండరిపురంలోని ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి యుటిఎఫ్ పల్నాడు జిలా కార్యదర్శి కె.తిరుపతిస్వామి అధ్యక్షత వహించగా లక్ష్మణరావు మాట్లాడుతూ గతసారి ఎన్నికల్లో 2.50 లక్షల ఓట్లుంటే ఈసారి 3.40 లక్షల ఓట్లున్నాయన్నారు. యడ్లపాడులో 2, నాదెండ్లలో 2, చిలకలూరిపేట పట్టణంలో 7 మొత్తంగా నియోజకవర్గంలో 11 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని చెప్పారు. వచ్చేనెల 10వ తేదీలోపు ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, మార్చి 14 నుంచి 24లోపు ఎన్నిక ఉంటుందని అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 2007లో హిందూ కాలేజీలో సర్వీసును పూర్తిగా వదులుకుని ఎమ్మెల్సీగా గెలుపొందారని, నాటి నుండి నేటి వరకు అనేక సమస్యలపై చట్టసభల్లో, ప్రభుత్వ వేదికలపై పోరాడ్డంతోపాటు ప్రజా ఉద్యమాల్లోనూ ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని చెప్పారు. కౌలురైతు సంఘం అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కౌలురైతులకు గుర్తింపు కార్డులు, రుణాల విషయంలో లక్ష్మణరావు కృషిని గుర్తు చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో కృషిని, ఉద్యమాలకు తోడ్పాటును యూనియన్ మండల అధ్యక్షులు జి.సావిత్రి చెపాపరు. అనంతరం బిఎస్ఎన్ఎల్ నాయకులు ఎవి శివయ్య, యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ కె.అరుణ, మండల ప్రధాన కార్యదర్శి యాసిన్, సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు.

మంగళగిరిలో లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాశం రామారావు తదితరులు

పెదనందిపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రపంచ కార్మికవర్గానికి స్ఫూర్తి లెనిన్

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రపంచ కార్మిక వర్గానికి స్ఫూర్తి లెనిన్ అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళవారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కార్మిక వర్గం ఆర్థిక సమస్యలపై పోరాడుతా యని అన్నారు. అలాంటి కార్మిక వర్గానికి సోషలిస్టు చైతన్యాన్ని కమ్యూనిస్టులు కల్పించాలని అన్నారు. పెట్టుబడిదారీ సమాజంలో కార్మిక వర్గం దోపిడీకి గురవుతున్న విధానంపై కార్ల మార్క్స్, ఎంగెల్స్ రాసిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి ప్రపంచం లో మొట్టమొదటి సారిగా కార్మిక వర్గాన్ని విప్లవం తీసుకువచ్చి రాజ్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. చిన్న వయసులోనే అనేక ఆటుపోట్లను ఎదుర్కొని కార్మిక వర్గ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగినది అన్నారు. జీవించినంత కాలం కార్మిక వర్గం కోసం, పేద ప్రజల కోసం నిరంతరం పనిచేసిన మహానీయుడు లెనిన్ అని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న పార్టీలన్నీ పెట్టుబడి వర్గ స్వభావానికి లోనై పని చేస్తాయని, కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే పేదల కోసం, కార్మిక వర్గం కోసం పనిచేస్తాయని అన్నారు. సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ మాట్లాడుతూ మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎన్నికల సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలో పేదలు ఇళ్లు వేసుకొని నివాసముంటున్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు ఇస్తామని వాగ్దానం చేశారని అన్నారు. ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, వై కమలాకర్, పట్టణ కమిటీ సభ్యులు ఎస్ గణేష్, ఎం నాగేశ్వరావు, కే శ్రీనివాసరావు, టి శ్రీనివాసరావు, జే బ్రాహ్మణి, జి దుర్గాప్రసాద్, ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కే బుజ్జి, జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదనందిపాడు

సోషలిస్ట్ విప్లవ నాయకుడు, ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ ముఖ్య నాయకులలో ఒకరైన కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సంవత్సరం మొత్తం కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. మంగళవారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం లో తొలుత విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు గారపాటి రమేష్, జంపని రామారావు లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, గారపాటి రమేష్, సిపిఎం మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు లు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు నల్లపనేని శివప్రసాద్, చెన్నుపాటి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

ఎయిమ్స్ కార్మికుల విజయం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు లేబర్ కోర్టు ద్వారా విజయం సాధించారు. గతంలో ఎయిమ్స్ నుండి 72 మందిని తొలగించడంతో, ఎయిమ్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేసి మరల కార్మికులను పనిలో పెట్టించడం జరిగింది. కాంట్రాక్టర్ తక్కువ వేతనాలు ఇవ్వడంపై సిఐటియు ద్వారా హైదరాబాద్ లేబర్ కోర్టులో వేయడంతో, వేతనాలు పెరిగాయి. ఏరియర్స్, బోనసు లకు సంబంధించి హైదరాబాద్ సెంట్రల్ కోర్టులో కేసు వేయడం జరిగింది. అందులో భాగంగా కొంతమందికి ఎరియర్స్ రూపంలో రూ.18 లక్షల 77 వేల 305 కోర్టు ద్వారా మంగళ వారం గెలవడం జరిగింది. దీంతో మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విజయోత్స కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉండి సిఐటియు ద్వారా ఆందోళన చేసి విజయం సాధించారని, ఈ ఆందోళనతో ఎయిమ్స్ కార్మికుల ందరికీ వేతనాలు పెరిగాయన్నారు. భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రమేష్, యూనియన్ కార్యదర్శి ఎం బాలాజీ, యూనియన్ నాయకులు కే బుజ్జి బాబు, ఆర్ నాగేశ్వరావు, కెవిఎస్ కిరణ్, ఏ రవికుమార్, బి విజయ సాగర్, జి శ్రీనివాసరావు, కే రవికుమార్, సిహెచ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది.



శేషమాంబను సత్కరిస్తున్న కత్తిమండప్రతాప్ తదితరులు

శేషమాంబకు తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో మంగళవారం నిర్వహించిన శ్రీశ్రీ కళావేదిక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో గుంటూరుకు చెందిన రచయిత్రి చుండూరు శేషమాంబకు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందజేశారు. మెమోంటో, ప్రశంసాపత్రం, దుశ్శాలువాతో శేషమాంబను శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షులు ఈశ్వరిభూషణం, చిట్టినేని లలిత, పార్థసారధి సత్కరించారు.

మృతదేహాలను పూడ్చిన చోటే మళ్లీ పూడుస్తున్నాం

దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని వ్య.కా.స బృందానికి విన్నపం

ప్రజాశక్తి - తాడికొండ

మండల కేంద్రమైన తాడికొండ దళితవాడకు స్మశాన స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. తాడికొండలోని మాదిగ, మాల కాలనీ లలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అనేక సమస్యలను సర్వే బృందం దృష్టికి తీసుకువచ్చారు. మూడువేల కుటుంబాలు ఉన్న మాదిగ సామాజిక తరగతి, మూడు వందల కుటుంబాలు నివాసం ఉంటున్న మాల సామాజిక వర్గానికి స్మశాన స్థలము చాలడం లేదని చనిపోయిన వారిని పూడ్చిన చోటనే పూడ్చ వలసిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు దృష్టికి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఉన్న కొద్దిపాటి స్మశానం కూడా దారి లేక రోజు రోజుకి ఉన్న స్థలం కూడా కుచించుకపోతుందని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని డ్రైనేజ్ సరిగా లేకపోవడం వల్ల కొద్దిపాటి వర్షానికి కాలనీ మొత్తం వర్షపు నీటితో మునిగిపోతుందని,దోమలు విపరీతంగా పెరిగిపోయి అంటూ వ్యాధులు భారిన పడాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు .మంచినీళ్లు ఐదు రోజులకు ఒకసారి వస్తున్నాయని అది కూడా కేవలం అరగంట మాత్రమే వస్తున్నాయని తెలిపారు. దళితవాడలో 80 శాతం మంది యువకులు భవన నిర్మాణ కార్మికులుగా ఉన్నారని వారికి సంక్షేమ బోర్డు నుంచి రావాల్సిన సదుపాయాలు అమలుకు కావడంలేదని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు కార్డులు ఎక్కువ మందికి లేవని తెలిపారు. కౌలు రైతులుగా ఉన్నవారికి కౌలు కార్డు ఇవ్వడం లేదని అలాగే అధిక వర్షాలు సమయంలోను, వరదల సమయంలో పంటలు నష్టపోతే పంట నష్టపరిహారం కూడా కౌలు రైతుకు అందించడం లేదని దీనివల్ల కౌలు రైతులు గిట్టుబాటు ధర లేక వాతావరణ పరిస్థితులు వల్ల నష్టం వస్తే అప్పులపాలు కావాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పనులను సంవత్సరా సంవత్సరానికి 150 రోజులు కల్పించి 300 వేతనం ఇస్తే తప్ప కుటుంబాలు గడప లేమని తమ ఆవేదన వెలిబుచ్చారు. రేషన్ ద్వారా బియ్యము,పంచదార మాత్రమే ఇస్తున్నారని నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న పరిస్థితుల్లో కందిపప్పు ,నూనె, గోధుమపిండి వంటి నిత్యవసర సరుకులు కూడా ఇవ్వాలని కోరారు. ఈ సర్వేలో రైతు సంఘం కార్యదర్శి భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు సేకరిస్తున్న ఈమని అప్పారావు, భాస్కరరావు తదితరులు

నివాళులర్పిస్తున్న వై.నేతాజీ తదితర నాయకులు

ఎస్‌డబ్ల్యూఎఫ్ నేత రామకృష్ణారావు హఠాన్మరణం

నివాళులర్పించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎపిఎస్ఆర్‌టిసి స్టాఫ్అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షులు గుర్రం రామకృష్ణారావు (52) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం మండలంలోని నారాకోడూరులో ఆయన స్వగృహంలో రామకృష్ణారావు భౌతిక కాయానికి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు ఎం హరిప్రసాద్, టివిజి రవి శంకర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, వై నేతాజీ తదితరులు ఘన నివాళు లర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రామకృష్ణారావు మృతి ఫెడరేషన్‌కు తీరని లోటని తెలిపారు. అందరినీ కలుపుపోయే స్వభావం, మంచితనం, కార్మికుల సమస్యలమీద నిరంతరం కృషి చేసే రామ కృష్ణారావు ఆశయాలు ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే ఘన నివాళి అని కొనియాడారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కె గంగాధరరావు, జె నాంచారయ్య, ఎస్ఎంయు డిపో నాయకులు శ్రీనివాస్, కె దండీశ్వర్, యూనియన్ నాయకులు ఈ విజయ్, కుమార్, డివి స్వామి, గుంటూరు 1డిపో మేనేజర్ ఎంవి రామకృష్ణ, ట్రాఫిక్ విభాగం ఇంఛార్జి నరసింహారావు తదితరులు నివాళు లర్పించారు. అనంతరం నారాకోడూరులో రామకృష్ణారావు అంత్యక్రియలు నిర్వహించారు.

27న బిసి మంత్రులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిసిల సంక్షేమ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరులోని టిడిపి .జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామారావు, మాధవి మాట్లాడుతూ ఈనెల 27న గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్రంలో బిసి మంత్రులకు సన్మానం చేస్తున్నట్టు తెలిపారు. మంత్రులు అచ్చెన్నాయుడు,.అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాస్, వాసం శెట్టి సుభాష్, కొలుసు పార్థసారధి తదితరులకు సన్మానం చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమం కన్వీనర్‌గా టిడిపి నాయకులు బండపల్లి శ్రీనివాసరావు వ్యవహరిస్తారని తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రజకలు అందరూ కలసి ఈసన్మానం ఏర్పాటు చేస్తున్నట్టు వారు తెలిపారు. బిసిలుగా రాజకీయాల్లో వివిధ హోదాల్లో ఉన్న వారినందరిని కలుపుకొని బిసి అభినందన సభ నిర్వహిస్తున్నా మన్నారు. 27వ తేదీన జరిగే బిసి అభినందన సభను బిసిలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర బడ్జెట్లో బిసిలకు రూ. 39వేల కోట్లు ప్రకటించారని తెలిపారు. విలేకరుల సమావేశంలో బండపల్లి శ్రీనివాసరావు, గుర్రపుశాల రామకృష్ణ, రాచకొండ నాగేశ్వరరావు, తుమ్మేటి మురళి, రాచకొండ లక్ష్మయ్య, మానురాజు సురేష్, కాకర్ల ఏసుబాబు, గడ్డం శ్రీను, నడికొట్టు రమణ, బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామారావు, గళ్ళా మాధవి

దట్టమవుతున్న మంచు దుప్పటి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దట్టంగా కురుస్తున్న మంచుతో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. 20 రోజులుగా చలితీవ్రత పెరగడంతోపాటు మంచు తీవ్రత ఎక్కువవుతోంది. ఈ క్రమంలో గత నెలరోజుల్లో పట్టణ పరిసరాల్లో రోడ్డు ప్రమాదాలు వాటిల్లి నలుగురైదుగురు మృతి చెందారు. ప్రమాదాలకు మంచే ప్రధాన కారణంగా తెలుస్తోంది. సాయంత్రం 5.30 గంటలకల్లా చీకటి పడుతుండడగా ఉదయం 8 గంటల వరకూ మంచు ఉండడంతోపాటు చలిగాలులూ వీస్తున్నాయి. మంచు వల్ల రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం ఒకెత్తయితే వాకర్లకూ ప్రమాద భయం పట్టుకుంది. ఈ నెలాఖరు వరకూ ఇదే పరిస్థితి తప్పదని తెలుస్తోంది. మంచు కారణంగా దారి సరిగా కనిపించకపోవడం, ఎత్తు పల్లాలు, మలుపులను వాహనదార్లు గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.

దీంతోపాటు వాహనాలను వేగంగా నడపడం, సరైన నిద్ర లేకపోవడం వంటివి ప్రమాదాలకు కారణంగా వాహన తనిఖీ అధికారి కెఎల్.రావు చెబుతున్నారు. అర్ధరాత్రి తర్వాత వాహనాలు నడపకుండా విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తున్నారు. తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే నిదానంగా వెళ్లాలంటున్నారు. మంచు సమయాల్లో వాహనదారులు రోడ్డు కనిపించే దూరం 10-15 మీటర్ల మధ్య ఉంటే 35 కిలోమీటర్ల వేగంలో వెళ్లాలని, రహదారి సూచికలు, వైట్ లైన్లను అనుసరించి వాహనాలు నడపాలని, వాహనానికి అమర్చే రెడ్ సిగ్నల్స్, బ్రేక్ సిగ్నల్స్ సరిగా పని చేసేలా చూసుకోవాలని చెబుతున్నారు. హైబీమ్ లైట్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల స్పష్టంగా కనిపించదన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు గ ర్తించేలా హెడ్ లైట్స్ ఆన్, ఆఫ్ చేస్తూ డ్రైవింగ్ చేయ్యాలన్నారు. వ్యవసాయ కూలీలను తరలించే వాహనాలు ప్రైవేట్ ట్రావెల్స్, బస్సులకు విధిగా వెనుకా ముందు రేడియం స్టిక్కర్లు అతికించాలన్నారు. మంచు కురిసే సమయంలో రోడ్డు తడిగా ఉండి బ్రేక్ వేసినప్పుడు స్కిడ్ అయ్యే అవకాశం ఉంటుందని, అతివేగం, హఠాత్తుగా బ్రేకులు వేయడం తగ్గించాలని రూరల్ సిఐ సుబ్బానాయుడు సూచిస్తున్నారు.

ఉదయం 7.40 గంటలకు చిలకలూరిపేట నరసరావుపేట రహదారిలో మంచు

'అంబటి.. నోరు జారితే ఊరుకోం'

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తమ పాలనలో నియోజవర్గ అభివృద్ధిని వెనక్కు నెట్టిన అంబటి రాంబాబు ఇప్పుడు నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కూటమి పార్టీల నాయకులు విమర్శించారు. సత్తెనపల్లిలోని టిడిపి ప్రజావేదికలో పలువురు నాయకులు మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. వెకిలి చేష్టలతో నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించిన అంబటి రాంబాబు నోరు జారితే తాటతీస్తామన్నారు. వైసిపి పాలనలో ఇసుక, భూ మాఫియా రెచ్చిపోయిందని, రాంబాబు తమ్ముడు మురళి, అల్లుడు ఇక్కడి సహజ వనరుల్ని దోచుకున్నారని ఆరోపించారు. సొంత పార్టీ వారితోనే జిల్లా నుండి తరిమేయించుకున్న అంబటి రాంబాబుకు కన్నా లక్ష్మీనారాయణను విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు. గత మెజారిటీ కంటే ఒక్క ఓటు తక్కువైనా రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న వ్యక్తి ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని రాజకీయాల్లో ఉన్నాడని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు కంబాల వెంకటేశ్వర్లు, పూజల వెంకట కోటయ్య, ఆళ్ల సాంబయ్య, జనసేన నాయకులు తవిటి భావన్నారాయణ, బిజెపి నాయకులు కట్ట శంకర్రావు పాల్గొన్నారు.

సెయింట్ జోసఫ్ హైస్కూల్లో నేర్పిన విద్యాబుద్ధిలే నన్ను ఎమ్మెల్యేగా చేశాయి

ప్రజాశక్తి- రెంటచింతల

జిల్లాలో అత్యంత ప్రాముఖ్యం పొందిన సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల టీచర్ల బోధన, నేర్పిన క్రమశిక్షణ వల్లే తాను ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పాపయ్య నేతృత్వంలో పలువురు పూర్వ విద్యార్థులు మంగళవారం గుంటూరు వెళ్లి ఎమ్మెల్యేను సన్మానించారు. వచ్చేనెల 7న నిర్వహించనున్న పాఠశాల రజతోత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్కూలు లేని రోజుల్లో 1949లోనే ఈ పాఠశాలను స్థాపించి వేలాదిమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఘనత యాజమాన్యానికి దక్కుతుందన్నారు. 1975 నుంచి 1980 వరకు తాను సెయింట్ జోసఫ్ పాఠశాలలో చదివానని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తుమ్మ లూర్దిరెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్య పింఛన్లపై పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

అనారోగ్య కారణాలతో ప్రత్యేక పింఛను పొందుతున్న మండలంలోని 31 మందిని వైద్య బృందం మంగళవారం పరిశీలించింది. బృందంలో డాక్టర్లు ఎస్.అయ్యప్ప నాయుడు, జె.లక్ష్మీకాంత్, ఎడ్లపాడు పిహెచ్సి డాక్టర్ పి.భరద్వాజ, ఎంపిడిఒ వి.హేమలతదేవి, వెలుగు ఎపిఎం రవీంద్ర ఉన్నారు.

జాబ్‌మేళాలో 46 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- మాచర్ల

నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తున్నదని, జాబ్ మేళాల నిర్వహణ అందులో భాగమని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు అన్నారు. పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం 3 కంపెనీలు జాబ్‌మేళా నిర్వహించగా 122 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 46 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి నియామక పత్రాలను టిడిపి నాయకులు జూలకంటి అక్కిరెడ్డి అందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి ఎం.రవీంద్ర నాయక్, మాచర్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఆర్.కిరణ్ నాయక్, సీడాప్ జాబ్స్ కో-ఆర్డినేటర్ ననినాయక్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు హాజరైన యువతీయువకులు

భీమవరం పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని భీమవరం పంచాయతీ కార్యదర్శి నక్క కోటిరెడ్డి (60) రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మరణించారు. భౌతికకాయాన్ని ఎంపిడిఒ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఈఓపిఆర్డీ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సందర్శించి నివాళులర్పించారు.

తహశీల్దార్, ఎస్ఐకు జెడ్‌పిటిసి సత్కారం

ప్రజాశక్తి - దాచేపల్లి

గ్రామ సభ నిమిత్తం మండలంలోని గామాలపాడుకు మంగళవారం వచ్చిన తహశీల్దార్ కుటుంబరావు, ఎస్సై సౌందర్ రాజన్‌ను టిటిడి పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి కుమారుడు, పిడుగురాళ్ల జెడ్‌పిటిసి వెంకట కోటయ్య సత్కరించారు. వారికి తిరుమల తిరుపతి దేవస్థానం క్యాలెండర్‌ను అందజేశారు.

పశు వైద్యశిబిరాల్లో నట్టల నివారణ మందు పంపిణీ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని ఒకటి, రెండు వార్డుల్లో మాచర్ల ప్రభుత్వ పశు వైద్యశాల సిబ్బంది మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. గొంతువాపు వ్యాధి టీకాలు, చూడు పరీక్షలు, దూడలకు, గేదెలకు నట్టల నివారణ టాబ్లెట్లు పంపిణీ చేశారు. 8 గేదెలకు చూలు పరీక్షలు, 124 గేదెలకు, 99 దూడలకు, 9 ఆవులకు నట్టల నివారణ టాబ్లెట్లు పంపిణీ చేసినట్టు పశు వైద్యశాల సిబ్బంది శ్రీధర్‌బాబు తెలిపారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని తుర్లపాడులో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి పి. కిరణ్మయి ఆధ్వర్యంలో 114 దూడలకు నట్టల నివారణ మందులు, 16 పశువులకు గర్భకోశ వ్యాధికోశ వ్యాధులకు చికిత్సలు, 27 సాధారణ చికిత్సలు, 21 పశువులకు చూడు పరీక్షలు, 586 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. యానిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్లు సాయి గోపీకృష్ణ, లిఖిత, గోపాలమిత్ర సామినేని వరప్రసాద్, చక్రవర్తి పాల్గొన్నారు.

ఊరేళ్లవారు చెబితే ఇళ్లకు రక్షణ

ప్రజాశక్తి - దాచేపల్లి

ఊరెళ్లేవారు తమకు సమాచారం ఇస్తే చోరీలు జరక్కుండా చర్యలు తీసుకుంటామని మండలంలోని గ్రామాలపాడు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి షేక్ జాస్మిన్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మండలంలో వరుస చోరీల నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఊరెళ్లేవారు తమకు చెబితే ఎల్‌హెచ్ఎంఎస్ పద్ధతి ద్వారా ఆ ఇంటికి రక్షణ కల్పిస్తామని తెలిపారు.

శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్ల నిర్మాణం

స్థలాలను పరిశీలించిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

శివశక్తి ఫౌండేషన్ తరుపున పట్టణంలో 4 బస్ షెల్టర్లను ఆధునిక పద్ధతిలో నిర్మించనున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు స్థలాలను మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ బస్ షెల్టర్లు లేకపోవడం వల్ల ప్రయాణికులు అవస్థ పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్, కౌన్సిల్ తన దృష్టికి తెచ్చిందని, అందుకే మార్కాపురం రోడ్‌లో, కారంపూడి రోడ్, నరసరావుపేట రోడ్, వెల్లటూరు రోడ్‌లలో బస్‌షెల్టర్లు నిర్మించబూనుకున్నామని తెలిపారు. నరసరావుపేట రోడ్డులో రెండు చోట్ల, కారంపూడి రోడ్డులో రెండు చోట్ల, మార్కాపురం రోడ్డులో ఒకచోట స్థలాలను పరిశీలించామని, రెండు మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. ఇంకా ఎక్కడైనా కావాలని మున్సిపల్ కమిషనర్ చెబితే వాటినీ నిర్మిస్తామన్నారు. సురేష్ మహల్ రోడ్డులో నిర్మిస్తున్న మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్‌నూ పరిశీలించి కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌తో మాట్లాడారు.

320 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఈపూరు

శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఈపూరు, వనికుంట, అంగలూరు, కొండాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో 320 మందికి శంకర కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. 97 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చనబోయిన వెంకటసుబ్బయ్య, కట్టా కోటయ్య, నర్రా రమణయ్య, నర్రా కిషోర్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంఈఓగా మల్లికార్జునశర్మ

ప్రజాశక్తి - దాచేపల్లి

ఇన్‌ఛార్జి ఎంఇఒ-1గా మల్లికార్జున్ శర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన కాంతారావు మృతి చెందడంతో రాజుపాలెంలో పని చేస్తున్న మల్లికార్జున్‌శర్మను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - దాచేపల్లి

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని మండల సెంట్రింగ్ యూనియన్ నాయకులు గుంటుపల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టిడిపి ప్రభుత్వంలో కార్మికుల ప్రమాదం జరిగినప్పుడు, శుభ కార్యక్రమాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసిందని పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు విన్నవించామని పేర్కొన్నారు.

లైవ్ మ్యూజిక్ షో ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పి

ప్రజాశక్తి - మంగళగిరి

గురువారం మంత్రి లోకేష్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళగిరిలో లైవ్ మ్యూజిక్ షో ఏర్పాటు చేశారు. మంగళగిరి బుద్ధారోడ్ లోని బెల్జియన్ వాపిల్ స్టోర్ ఎదురుగా ఉన్న మైదానంలో లైవ్ మ్యూజిక్ షో ప్రాంగణంలో ఏర్పాట్లను ఎస్పి ఎస్ సతీష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రోగ్రాంనకు వచ్చే ప్రేక్షకుల భద్రత ఏర్పాట్లపై ఎస్పీ అధికారులతో సమీక్షించారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులను ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ సతీష్ కుమార్ వెంట ఏ ఎస్ పి రవికుమార్ నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ, మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పోలీసులు నిర్వహకులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి వెల్ఫేర్ డెవలప్మెంట్ సొసైటీ (టిడబ్ల్యుడిఎస్) ఆధ్వర్యములో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల నిర్వహణపై మంగళవారం కరపత్రం ఆవిష్కరించారు. స్థానిక అష్టలక్ష్మి గుడి ప్రాంగణంలో ఆవిష్కరించిన కార్యక్రమంలో సంస్థ ప్రతి నిధులు పాల్గొన్నారు. మహిళల అభ్యుదయం డిజిటల్ అక్షరాస్యతను అందించడానికి ఇన్ఫర్మాటిక్స్ కంప్యూటర్ ఇన్స్టి ట్యూట్ సంస్థ ఎంతగానో దోహదపడుతుందని సొసైటి సభ్యులు సునీల్ తెలిపారు. తమ నైపుణ్యాలను మెరుగు పరచుకోవడానికి, వ్యక్తిగత అలాగే వృత్తిపరమైన అభివృద్ధికి సంస్థ ద్వారా విజ్ఞానంపొందే అవకాశాన్ని సద్వినియోగప రచుకోవాలన్నారు. జనవరి 22 నుండి నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. వివరాలకు 9492125064 ఫోన్ నంబరును సంప్రదించగలరన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చంద్ర కుమారి, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన చైర్ పర్సన్

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక మంగళవారం పరిశీలించారు. స్థానిక 23వ వార్డులో ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ల పూడికతీత వంటి పనులను ఆమె పరిశీలించారు. శానిటేషన్ పై సమస్యలను స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమం లో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. హెలెన్ నిర్మల, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు,అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ కుమార్, శానిటరీ ఇన్ స్పెక్టర్ జి. ప్రసాద్, సిహెచ్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళాపోలీసులకు జాబ్‌చార్ట్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మహిళా పోలీసుల జాబ్ చార్ట్ నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహరించబోతున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పి ఎస్ సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక చెంచు పేటలోని చావాస్ గ్రాండ్ కళ్యాణమండపంలో మహిళా పోలీసులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీసులు వ్యవహరించాల్సిన పనితీరుపై పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ వ్యవస్థలో మార్పులు తేవాలంటే మహిళా పోలీసులకు సగ్రమైన జాబ్ చార్ట్ ఎంతో అవసరమని అన్నారు. వారికి అనుకూలంగా స్పష్టమైన, సమగ్రమైన జాబ్ చార్ట్ శిక్షణ సిలబస్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మహిళా పోలీసులకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. వారి ఉద్యోగ ప్రమాణాలతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన జాబ్ చార్ట్ పోలీసు శాఖపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గిస్తుందన్నారు. ఇకపై పోలీసులకు ప్రజలకు వారధిలా మహిళా పోలీసులు వ్యవహరించబోతున్నారని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లను ప్రతిరోజు సందర్శించడం ద్వారా నేరాలను మరింత నియంత్రించవచ్చని అన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్

గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, ప్రేమ ఉచ్చులు, సోషల్ మీడియాలో మోసాలు, రోడ్డు భద్రత, బాల్య వివాహాలు అరికట్టడం, పోలీస్ సంబంధిత పిటిషన్లు, గృహహింస, వరకట్న వేధింపులు, సామాజిక దురాచారాలు, ఈవ్ టీజింగ్, దొంగతనం సైబర్ మోసాలు, మోసం, శారీరక నేరాలు, బహిరంగ మద్యపానం అంశాలపై పట్టు బిగించాల్సిన ఆవశ్యకత మహిళా పోలీసులపై ఎంతైనా ఉందన్నారు. నేర రహిత సమాజ స్థాపనకు మహిళా పోలీసులు నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి డిఎస్పి బి జనార్ధన రావు, దిశ డిఎస్పి సుబ్బారావు, తెనాలి సిఐ లు బెల్లం శ్రీనివాసులు, వి మల్లికార్జునరావు, కె రాముల నాయక్, ఎస్ రమేష్ బాబు పాల్గొన్నారు.

కెఎల్‌యు విద్యార్థులకు రజిత, కాంస్య పతకాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఆల్ ఇండియా ఇంటర్ యునివర్సిటీ షూటింగ్ చాంపియన్షిప్ క్రీడల పోటీల్లో కె ఎల్ యునివర్సిటీ కి చెందిన నేలవల్లి ముఖేష్ రజత పతకం సాధించినట్లు వర్శిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ మంగళవారం తెలిపారు. 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగం లో ముఖేష్ కు 582 /600 స్కోర్‌తో ఈ పతకం లభించింది. ఈ నెల 8 నుంచి చండీఘర్ లోని మొహాలీ షూటింగ్ రేంజ్ లో పంజాబ్ యునివర్సిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిశ్రమ విభాగంలో ముఖేష్, నాగసాయి తరుణ్ .పి, తనిష్క్ మురళీధర్ నాయుడులతో కూడిన కె ఎల్ యునివర్సిటీ జట్టు 5వ స్థానంలో నిలిచి మరో కాంస్య పతకం కూడా గెలుచుకున్నారని అన్నారు. ముఖేష్ నేలవల్లి కె ఎల్ యునివర్సిటీ లో బీ టెక్ సిఎస్ ఐటి 3వ సంవత్సరం చదువుతుండగా, నాగసాయి తరుణ్.పి , తనిష్క్ మురళిధర్ నాయుడు లు బిబిఎ చదువుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, వ్యాయామ అధ్యాపకులు విజేతలను అభినందించారు.

పిపిపి విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ

వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమపై సమీక్షలో ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఆటోనగర్లోని ఏపీఎంఎస్ఐడిసి కార్యాలయంలో మంగళవారం వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చర్చించిన పలు అంశాలను ఆయన వివరించారు. రాష్ట్రంలో పది ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో కళాశాలల నిర్వహణపై చర్చించి, జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ వారు సమర్పించు నివేదికను బట్టి మిగిలిన వైద్యకళాశాలలను సేఫ్ క్లోజర్ చేయనున్నట్లు తెలిపారు.మందులు లభ్యత గురించి ఆరా తీసి, మందుల కొరత రాకుండా ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంచాలని, మందుల అవసరార్థం జనఔషధి వారితో సంప్రదించి అన్నిటినీ అందుబాటులోకి తీసుకువచ్చి పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు ఎల్లవేళలా అందుబాటులోకి తీసుకురావాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విప్లవాత్మకైనా మార్పులను తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తున్నట్లుగా చెప్పారు. ఔషధాలను తగిన రీతిలో సరఫరా చేయాలని, గడువు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

ముగిసిన మందులు పారవేయడం కొరకు తగు చర్యలు తీసుకోవాలని, క్యాన్సర్ రోగులకు అవసరమైన వైద్య పరికరాలను, వైద్య సేవలను మరింత మెరుగుపడేలా చేయనున్నామని, గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మరిన్ని మౌలిక వసతులను, సదుపాయాలను సత్వరమే అందించేలా దష్టి పెట్టామని తెలిపారు. సమావేశంలో శాప్ మరియు ఏపీఎంఎస్ఐడిసి నూతన వైస్-చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీష, ప్రస్తుత ఏపీఎంఎస్ఐడిసి వైస్-చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సిరి , చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజనీర్ హర్షవర్ధన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కష్ణమోహన్ , జనరల్ మేనేజర్ సూర్యకళ , ఏపీఎంఎస్ఎడిసి వివిధ విభాగాధిపతులు,ఆరోగ్యశాఖాధిపతులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాశం రామారావు

ఇళ్ల పట్టాల సమస్యలపై సచివాలయాల్లో
27న రాయబారం : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

సిపిఎం అనేక సంవత్సరాల పోరాట ఫలితంగానే కూటమి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు , ఇళ్ల స్థలాలు ఇస్తామని చెబుతుందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. సోమవారం రాత్రి తాడేపల్లి పట్టణం పరిధిలోని మేక అమరారెడ్డి భవన్ లో సిపిఎం తాడేపల్లి పట్టణ కమిటీ విస్తృత సమావేశం సిపిఎం పట్టణ నాయకులు కొట్టే కరుణాకర రావు అధ్యక్షతన జరిగింది.సమావేశంలో రామారావు మాట్లాడుతూ అర్హులైన పట్టణ పరిధిలోని పేదలందరికీ రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గృహ నిర్మాణ పథకాన్ని వెంటనే అమలు చేసి, ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. అంతే కాకుండా పట్టణంలోని బైపాస్, ఇతర ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు కృష్ణానది నీటిని ప్రజలకు అందించాలన్నారు. శిధిలా వస్థలో ఉన్న పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి, అడ్డగట్ల శౌరి భర్తలోమ్, దొంతి రెడ్డి విజయభాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి

కౌలు రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

కాలయాపన చేయకుండా కౌలు రైతులకు బ్యాంకు రుణాలు వెంటనే ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని మందపాడు గ్రామంలో మంగళవారము పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బాగంగా కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం పై బ్యాంకర్లతో సమావేశము జరిగింది. కౌలు రైతు కార్డుల ద్వారా పంట కాలంలో పండించిన పంటను, ఈ క్రాప్ నమోదు చేసుకొంటే విపత్తులు సంభవించినప్పుడు ఇన్పుట్ సబ్సిడీ కౌలు రైతులకు అందించడం జరుగుతుందని ఎంఎఒ ఎం నాగరాజు తెలిపారు. విత్తిన పంటకు ఇన్సూరెన్స్ చేయడం ద్వారా కూడా పంటకు రక్షణ ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు. మద్దతు ధర లేనప్పుడు కొనుగోలు కేంద్రాలు ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుంది అని తెలిపారు. సి సి ఆర్ సి కార్డులు 11 నెలల కాల పరిమితికి మాత్రమే చెల్లుబాటు అవుతాయని, భూమికి సంబంధించినవి కాదని తెలియజేసారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తీసుకునే సర్వే నెంబర్లు గల భూములలో కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని, ఇచ్చిన తరువాత లోన్ కార్డ్ లలో నమోదు చేయబడతాయని, రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు అధ్యక్షుడు రామకృష్ణ, మందపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కార్మికుల ఆకలి కేకలు వినపడవా?

32వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గత 32 సంవత్సరాలుగా తమకు రావలసిన నష్టపరిహారం కోసం న్యాయ పోరాటం చేస్తూ ఆకలికి అలమటిస్తున్న కార్మికుల ఆకలి కేకలు పాలక పక్షాలకు వినపడవా అని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ నాయకులు బూరగ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆనాడు నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కారం చేస్తారని మాట ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటుతున్న కార్మికులకు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం నష్టపరిహారం ఇప్పించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీక్షలలో ఎం శివకుమారి, టి దుర్గా భవాని, ఈ శారమ్మ, వై రమాదేవి, విజయశ్రీ కూర్చున్నారు. ఈ దీక్షకు మద్దతుగా ఎసిసి కార్మిక పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, బి అంకయ్య, ఏఐఎప్టియు నాయకులు కే ఆదినారాయణ, బి సూరి, ఆర్ విజయన్, వై సాంబయ్య, యెహోషువ, ఎండి రహంతుల్లా, శారద, డి రమణ, లక్ష్మి, బుజ్జి, నాగేశ్వరరావు, సిహెచ్ పిచ్చయ్య, ఆరిఫ్, డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎసిసి కార్మికుల దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న వేముల దుర్గారావు

'రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు'పై నేడు సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ

సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' అన్న అంశంపై సదస్సు జరుగుతుంది. విజయవాడ రాఘవయ్యపార్క్ సమీపంలోని బాలోత్సవ భవన్ రెండో అంతస్తులో జరిగే ఈ సదస్సులో ఉపన్యాసకులుగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి పాల్గొంటారు.

శ్రీనివాసరావును సన్మానిస్తున్న జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు

జడ్‌పిహెచ్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

చిలకమర్తి పై కందుకూరి ప్రభావం అనే అంశంపై పరిశోధన చేసిన ఉపాధ్యాయులు ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు తోట శ్రీనివాసరావుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్యులు ఈ మాధవి పర్యవేక్షణలో శ్రీనివాసరావు తన పరిశోధనను పూర్తి చేశారు. జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు మంగళవారం ఈ సందర్భంగా మాట్లాడుతు డాక్టరేట్ రావడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని తెలిపారు. వర్సిటీ విభాగం అధ్యాపకులు ఆచార్య వరప్రసాద మూర్తి, ఆచార్య మాధవి, డాక్టర్ ఎన్వీ కృష్ణారావు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణితం ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, పి బుజ్జిబాబు, డి రమణమ్మ, వెంకటేశ్వరరావు, కే రామచంద్రరావు, ఈ ఆనందరావు తదితరులు డాక్టరేట్ డిగ్రీ పొందిన శ్రీనివాసరావుని శాలువాని కప్పి శాలువాను కప్పి, ఘనంగా సన్మానించారు.

ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న బిపిఎల్, విజ్ఞాన్ ప్రతిధులు

బిపిఎల్ మెడికల్ టెక్నాలజీస్‌తో విజ్ఞాన్స్ ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ-బెంగుళూరులోని బిపిఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. సోమవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీపీఎల్ వైస్‌ప్రెసిడెంట్ మురళీక్రిష్ణ మీనన్, బిజినెస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్ట్రాటజిక్ సర్వీసెస్ హెడ్ మనోగరన్‌తో వర్సిటీ వీసీ నాగభూషణ్ ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతోపాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, సెమినార్‌లు, ఇండస్ట్రీ-అకాడెమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామన్నారు. వీటితోపాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతోపాటు వత్తిపరమైన వద్ధిని పెంపొందిస్తామన్నారు. బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాస్టర్స్, పీహెచ్‌డీలు పూర్తి చేయడానికి కావలసిన సహకారాన్ని అందిస్తామన్నారు. మురళీక్రిష్ణమీనన్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందచేస్తున్న భాష్యం రామకృష్ణ

ఉత్సాహంగా కొనసాగుతున్న భాష్యం క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు

గెలుపోటములకు అతీతంగా క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ అన్నారు. మంగళవారం భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జెఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టి20 క్రికెట్ టోర్నమెంట్ - బిపిఎల్ 2024-25లో భాగంగా జరుగుతున్న ప్రిలిమినరీ మ్యాచ్‌లు రెండో రోజు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్లో హైద్రాబాద్ హాక్స్ జట్టు - 3తో, గుంటూరు జెయింట్స్-3 తలపడగా గుంటూరు జెయింట్స్-3 జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం కృష్ణా నైట్స్ జట్టుతో వైజాగ్ వెలాసిటీ-3 జట్టు తలపడగా వైజాగ్ వెలాసిటీ-3 జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం వైస్‌ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలి

శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంపై సమావేశంలో కమిషనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) పనులు ప్రారంభానికి ముందే నగరంలోని ప్రధాన రహదారులను ట్రాఫిక్ రద్దీకి తగిన విధంగా సిద్ధం చేసుకోవాలని, ట్రాఫిక్, రైల్వే, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, జిఎంసి, రైల్వే, ఆర్ అండ్ బి, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణానికి ముందుగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించామని, ప్రభావిత భవన యజమానులకు నోటీసులు ఇచ్చి, అంగీకారం తెలిపిన భవనాలను తొలగిస్తున్నామన్నారు. బ్రిడ్జి పనులు ప్రారంభమైతే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రధానంగా 3 వంతెనల వద్ద మరొక వెంట్ ఏర్పాటు చేసి, రోడ్డు వెడల్పు చేయడానికి రైల్వే అధికారులు పరిశీలించాలని, తద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చన్నారు. అలాగే శంకర్‌విలాస్ సెంటర్ నుండి అమరావతి రోడ్డులోని ఇన్నర్ రింగ్ రోడ్ జంక్షన్ వరకు, బ్రాడీపేట, అరండల్ పేటల్లో రోడ్ల ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరానికి కీలకమైన ఆర్‌ఓబి పనులు జరిగే క్రమంలో అన్ని శాఖలను, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేకంగా సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని సూచించారు. నిర్మాణ పనుల వలన జిజిహెచ్, రైల్వే స్టేషన్‌కు వచ్చే వేలాది మంది ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను త్వరగా సిద్ధం చేసుకోవాలన్నారు. అరండల్‌పేట, బ్రాడీపేట 1వ లైన్లను విస్తరణ చేయడానికి రైల్వే, జిఎంసి సంయుక్తంగా కృషి చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ బ్రాడీపేట 14వ అడ్డరోడ్డులోని రైల్వేగేటుని ఆర్‌ఓబి నిర్మాణ పనులు జరిగే కాలంలో రాకపోకలకు అవకాశం కల్పిస్తే ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గుతుందన్నారు. అలాగే ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించాలని, ముందుగా ఫుడ్ కోర్ట్ వెండింగ్ జోన్లను కేటాయించాలని సూచించారు. జిజిహెచ్‌కి నిత్యం ఎమర్జెన్సీ అంబులెన్స్‌లు వస్తుంటాయని, అందుకు తగిన విధంగా ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో రైల్వే ఏఓఎం ముఖేష్‌కుమార్, డిఈఎన్ భరత్ కుమార్, జిఎంసి ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఆర్‌అండ్‌బి ఈఈ విశ్వనాధరెడ్డి, డిఈఈ చిన్నయ్య, ట్రాఫిక్ సిఐలు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో ఈనెల 26వ తేదీన సాయంత్రం 5 గంటలకు 75వ రిపబ్లిక్‌డే సందర్భంగా తాను రాసిన 'భారత రాజ్యాంగం' పుస్తకం ఆవిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం గుంటూరులో ఆహ్వానపత్రాలను లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం పుస్తకంతోపాటు మరో నాలుగు పుస్తకాలను కూడా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ కె.మోషెన్‌రాజు, సిపిఐ, సిపియం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు

ఆహ్వానపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

షేక్.మస్తాన్‌వలి, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఐలు రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొంటారన్నారు. ఆహ్వానపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.కళాధర్, ఎల్ఐసి నాయకులు వివికె.సురేష్, ఎల్.ఎస్.భారవి, అవధానుల హరి, కైలాస్, సుభాని, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో

వర్సిటీ బస్సుల సమయాలు మార్పు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం నుండి జరగనున్న పోస్ట్ గ్రాడ్యు యేషన్ (పీజీ)పరీక్షల నేపథ్యంలో ఉద్యోగులను, అధ్యాపకులను వర్సిటీకి తీసుకువచ్చే బస్సుల సమయంలో మార్పులు చేసినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. సుబ్బారావు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆదేశాల మేరకు బస్సు సమయాలను ఈనెల 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మార్పులు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి పరీక్షలు : విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుండి ప్రారంభిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ రావు తెలిపారు. పీజీ లో ఆర్ట్స్, సైన్స్, ఎంబీఏ, ఎంఈడి కోర్సులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వ్యవహరిస్తారన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థినులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ విద్యార్థినులు జెకెసి కాలేజిలో సదర్లాండ్ గ్లోబల్ సర్వీసు కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 66 మంది పాల్గొనగా 43 మంది ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డిని సెయింట్ ఆన్స్ కాలేజి ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య అభినందించారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి రూ.2.5 లక్షల నుండి రూ.3 లక్షల వార్షిక వేతనం అందుతుందన్నారు. ఆయా విద్యార్థినులకు వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారూన్‌రోజ్, అధ్యాపకులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఘనంగా క్రేన్ కాంతారావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

క్రేన్ వక్కపొడి అధినేత జి.కాంతారావు జన్మదిన వేడుకలు స్థానిక సంపత్‌నగర్‌లోని క్రేన్ ఆఫీసులో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరి, కార్పొరేటర్ సిటీ బస్సు బాబు, నేరెళ్ల హరి, డాక్టర్ వై షేక్, గుంటూరు మిర్చియార్డ్ మాజీ వైస్ చైర్మన్ కొత్తూరు వెంకట్ , గుంటూరు జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు , పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, కంపెనీ ఏజెంట్లు, సిబ్బంది కాంతారావుకు శుభాకాంక్షలు తెలిపారు.

కాంతారావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది